# కొత్త రచయితలు

# లవ్ స్టోరీ
# మౌనరాగం

18-1-91

"తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు కదిలాయి మదిలోన ఎన్నెన్ని కలలో, ఎన్నెన్ని కథలో...!"

ఇప్పటి వరకు ప్రశాంతంగా వున్న నా మానస సరోవరం మీ రాకతో తొలకరి జల్లుకి పులకరించినట్లు పరవళ్లు తొక్కుతూంది. మీ గురించి నాకేమీ తెలియదు. కనీసం మీ పేరు కూడా. నాకు తెల్సిందల్లా వెన్నెలంటి మీ రూపమే. ఆ రూపమే నాలో కలిగించింది భాషకందని ఎన్నో భావాల్ని.

నాన్నగారు మిమ్మల్ని పరిచయం చేస్తున్నప్పుడు మీ చూపుతో నా చూపు కలిసిన తరుణంలో నాలో ఏదో కలవరం. కన్నులు చిలికే భావాలకు భాష్యం చెప్పకోలేక మనస్సు తికమకపడింది. మిమ్మల్ని చూసే క్షణం వరకు నా మనస్సులాగానే నా డైరీ కూడా ఖాళీగానే వుండిపోయింది. ఏ క్షణాన మీరు మూసివున్న నా గుండె తలుపుల్ని సుతారంగా తోసుకుని నా మనో మందిరంలోకి ప్రవేశించారో ఆ క్షణంలోనే ప్రారంభమయింది నా మనస్సులో సన్నాయి రాగం. మనస్సుపాడేమౌన గీతాన్ని ఈ తెల్లకాగితాలపై సజీవంగా ముద్రిస్తున్నాను. "తొలి చూపుకే ఇన్ని పులకింతలా". నాకిప్పుడు అన్పిస్తుంది నేనో మంచి రైటర్ని అయినా బావుండేదని – మనస్సులోని భావాన్ని ఇంతకన్నా అందంగా వ్రాసుకుని వుండేదాన్ని కదా!

సన్నజాజుల వాసనని కలుపుకొని లోపలికొస్తున్న ఈ చిరుగాలిలో నిశ్శబ్దంగా వున్న అర్ధరాత్రి వేళ కిటికీలో నుంచి పడుతున్న వెన్నెల వెలుగులో మీ గురించి ఆలోచిస్తూ డైరీ వ్రాయడం... నిజంగా చాలా అద్భుతంగా వుంది ఈ అనుభవం. నిదుర రాని కనుపాపలకు జోలపాడలేక మీ తలపుల తలుపులు మూయలేక సతమతమయ్యే మనస్సు ఈ రోజుకి ఈ రాగం చాలంటుంది. నా కనురెప్పల మాటునదాగిన అందమైన స్వప్నం మీ రాకకు స్వాగతం పలుకుతుంది. ప్రియతమా స్వాగతం.

19-1-91

"నిన్న వచ్చిన అబ్బాయి ఎవరండి" అని అమ్మ అడిగితే "గౌతమ్ అని మొన్ననే మా ఆఫీసులో జాయినయ్యాడు. పాపం తనవాళ్లెవరూ లేని అనాధట. రూమ్ కోసం వెతుకుతుంటే మన మేడమీద రూమ్ ఖాళీగానే వుంది కదా. అందులో ఆ అబ్బాయిని వుండమని చెప్పాను" అన్న నాన్నగారి మాటలకు నాకెంత సంతోషం కలిగిందో. మీరు మానసికంగా నా గుండె గదిలో భౌతికంగా మా మేడమీద గదిలో! నా కనుపాపల ఎదురుగా!!

20-1-91

గౌతమ్—ఎంత గాంభీర్యమైన పేరు, మీ రూపంలాగే! మీరు పైకి ఎంత రిజర్వ్‌డ్‌గా వుంటారో లోపల అంత చిలిపివారు అయ్యుంటారని అన్పిస్తుంది. నా ఊహ కరెక్టేనా? కళ్ళు మనస్సుకి వాకిళ్ళు! మీరు దాచినా మీ కళ్ళు దాయలేవు మీలోని చిలిపితనాన్ని. మీ పెదవులు నవ్వవు కాని మీ కళ్ళు మాత్రం కొంటెగా నవ్వుతాయి.

"అల్లో నేరేడు పళ్ళు అబ్బాయి కళ్ళు గుచ్చే గులాబి ముళ్ళు"

2-2-91

నేనింతవరకు చూడని బ్రహ్మచారి గది ఎలా వుంటుందో చూడాలని మీరు స్నానానికి వెళ్ళినప్పుడు మీ గదిలోకి వచ్చాను. అబ్బో చాలా నీట్‌గానే సర్దుకున్నారు గదిని! మీ వద్ద మంచి సాహిత్యమే భద్రపరుచుకున్నారు. ముఖ్యంగా మీరు తిలక్, కృష్ణశాస్త్రిల అభిమాని అంటే మీలో మంచి భావుకత్వమే వుండి వుంటుంది. ఈ రోజు నేను మొట్టమొదటి దొంగతనం మీ గదిలో చేశాను. అదే, చిరునవ్వులు చిందిస్తూ టేబుల్ మీద వున్న మీ ఫోటో ఫ్రేమ్ దొంగిలించడం.

8-2-91

గౌతమ్! సాయంత్రం నాన్నగారితో ఇంటి ముందు మొక్కల దగ్గర కూర్చుని మీరుమాట్లాడుతున్నప్పుడు మీకు నాలుగడుగుల దూరంలో మల్లెపొద చాటునుండి మల్లెలు కోసేపని మరిచిపోయి మిమ్మల్ని చూడడంలో మునిగిపోయాను. మీరు మాత్రం నన్ను గమనించలేదు. అతి చేరువగా వుండి మిమ్మల్ని (గమనించడం) చూడడం అదే మొదటిసారి. నాన్నగారితో ఏదో మాట్లాడి మీరు నవ్వుతున్నప్పుడు, మీ నవ్వు అలలా సాగి పిల్లతెమ్మెరలా నన్ను ముట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేసింది. తెల్లని పలువరుస మధ్య నుండి పెదవి మీదకు వెన్నెల్లా జారిన నవ్వు ఎంత మనోహరంగా వుందో... ప్రియతమా మీ నవ్వులోని స్వచ్ఛతకు నా చేతిలోని మల్లెలు తలొంచుకున్నాయి!

17-2-91

గౌతమ్! మీ పనేదో మీరు చేసుకుపోతూ ఇతరుల ఉనికిని అసలు పట్టించుకోరు. మీ చూపు కోసం, మీ రూపం కోసం, మీ పలుకు కోసం, మీ నవ్వు కోసం ఓ ప్రాణి అనుక్షణం ఎదురు చూస్తుంది అన్న సంగతి మీకు తెలుసా. "పందన్న వినదీ మనసు, కలనైన నిన్నే తలచు"

26-2-91

మీకు జ్వరంగా వుందా!?! అమ్మనోట ఆ మాట విని నా మనస్సు వేగంగా మీ వద్దకు పరుగులు పెట్టాలని చూసింది. శరీరమే అందరి ఎదుటా బయటపడడానికి జంకింది. అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళాక క్లాసులు లేవని మధ్యాహ్నం కాలేజీ ఎగ్గొట్టి అమ్మ నిద్రపోతున్న సమయంలో మీ గదిలోకి వచ్చాను. మంచి నిద్రలో వున్నారు మీరు. నిద్రలోఅమాయకంగా వున్న మీ ముఖం చూస్తూ నన్ను నేను మరచి నిలిచిపోయాను. నాకు అక్కడ నుంచి త్వరగా వెళ్ళిపోవాలని అన్పించలేదు. నుదుటిమీద పడి వున్న మీ జుట్టుని ఆర్తిగా సవరించి నల్లని మీసం క్రింద సిగరెట్ రుచి తెలియని ఆ ఎర్రని పెదవుల మీద ఓ చిరుముద్దుని నా ప్రేమ కానుకగా మీకివ్వాలని లోలో తపన. మనస్సు తొందర పెడుతున్నా నా నరనరాన జీర్ణించుకుపోయిన సాంప్రదాయం, కట్టుబాట్లు నన్నాపనిని చెయ్యనివ్వలేదు. కళ్ళలో మీ రూపాన్ని నింపుకుంటూ మౌనంగా నిల్చుని చూస్తున్న నా హృదయం

...వారు కళ్ళు ఎప్పుడు విప్పారో గమనించలేదు. ... గదిలో నన్ను-మీరూహించని విషయం. ... కళ్ళల్లో విస్మయం. మీరేదో మాట్లాడాలని నోరు తెరిచారు నేను నాభావోద్వేగాన్ని ఆపుకోలేక ...రున వెనుదిరిగి వచ్చేశాను. తరువాత నన్ను నేనే తిట్టుకున్నాను-పలకరించకుండానే వచ్చేశానే అని.

*4-3-91*

"పుట్టినరోజు పండుగే అందరికి" నాకిది ఇరవయ్యవ పుట్టినరోజు. మీ రాకతో నా మనస్సంతా నిండిన వసంత సోయగం రెట్టింపు ఉత్సాహాన్నిస్తుంది. 'జగమంతా మధురంగామారిపోయిన అనుభూతి. ఆకుపచ్చ కంచిపట్టు లంగా, పచ్చ చోళీ,తెల్లని వోణీ వేసుకుని, అక్క జుంకీలు,చెంప స్వరాలు, 'అమ్మ రాళ్ల నెక్లెస్, రాళ్ల గాజులు, నా బంగారు గొలుసు, చెల్లెలి రెండు పేటల ముత్యాల గొలుసు, నడుంకి ముత్యాల వడ్డాణం...ఈ నగలన్నీ పెట్టుకుని, అవుటాఫ్ ఫ్యాషన్ అయిపోవడం వల్ల పెట్లో నిద్రపోతున్న జడగంటలు బయటకు తీసి వేసుకుని, దొడ్లో పూలన్నీ కోసి కట్టిన పెద్దమాల జడలో తురుముకుని మువ్వల పట్టీలు మోగించుకుంటూ స్వీట్స్‌తో మీ రూమ్‌కి వస్తే వింత, విస్మయం, ఆశ్చర్య ఆనందాలు కలబోసిన చూపు చూశారు. మీ ఆశ్చర్యం సంగతి తరువాత, ఎప్పుడూ సాదాగా వుండే నేను ఈ వేషం వేసే సరికి ఇంట్లో అందరికీ చెప్పలేని విస్మయం. అమ్మా నాన్నగారు మినహా మిగతా అందరూ గంగిరెద్దు వేషం అని వెక్కిరించారు. మీరు కూడా కళ్లతో నావైపు ఏదోభావాన్ని ప్రసారం చేశారు. కాని నా మనస్సే దానికి సరిగా భాష్యం చెప్పుకోలేకపోయింది. విషెస్ చెప్పి గిఫ్ట్‌గా మీ ర్యాక్‌లో నుంచి 'మరీచిక' నవల తీసి ఇచ్చారు. ఆ నవలే ఎందుకు కానుకగా ఇచ్చారో ఏదైనా ప్రేమ నవలా ఏమిటి అనుకుని చదివాను.ఊహు! ఆ నవలే ఎందుకు ఇచ్చారో నా బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. 'చేతికందిన నవలయ థాలాపంగా ఇచ్చి వుంటారులే' అని సరి పెట్టుకున్నాను' నాకు అత్యంత ప్రియమైన మీ నుండి అందుకున్న ఈ తొలి కానుకను జీవితాంతం అపురూపంగా దాచుకుంటాను.

*9-3-91*

"కలవైనా నీ తలపే కలవరమందైన నీ తలపే...ఎందుకిలా నా మనస్సుని ఆక్రమించుకుని నన్ను నన్నుగా మిగలకుండా చేస్తున్నారు!?! మీ ప్రేమ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న నేను ఏ తీరం చేరతానో....

"అది ఒక ఇదిలే..."

*14-3-91*


గౌతమ్!మీ మనస్సేమిటో నాకు తెలియదు. మిమ్మల్నే కలవరిస్తున్న నా మనస్సుని మీరు గమనించారో లేదో అంతకన్నా తెలియదు. కాని నాన్నగారు మాత్రం వేరే వ్యక్తితో నా పెళ్లి జరిపించడానికి తొందర పడుతున్నారు. నాన్నగారి ఫ్రెండ్ వాళ్లింట్లో ఎవరో పెద్దవాళ్లు చివరి దశలో వున్నారని కొడుకు పెళ్ళి చెయ్యాలనుకుని నన్ను ఇచ్చి చెయ్యమని అడిగారుట. దాంతో నాన్నగారు మంచి సంబంధం అనుకుంటూ సంతోషపడి, నా కూతురు నా మాట కాదనదు అంటూ వాళ్ల బ్బాయికి నన్ను ఇవ్వడానికి ఒప్పుకుని మాట ఇచ్చారట. నాన్నగారితో పెళ్ళి ఇష్టం లేదని చెప్పాలంటే భయం. నేనుచదువుకోవాలి, నాకిప్పుడే పెళ్ళి వద్దు అని అమ్మతో చెప్పాను.

*17-3-91*

కొత్త సంవత్సరాది ఉగాది. ఇంట్లో అందరూ ఓ మంచి కుటుంబంలోని వ్యక్తితో కాణీ కట్నం లేకుండా నా పెళ్ళి నిశ్చయం అయినందుకు చాలా సంతోషంగా వున్నారు. కాని నేను మాత్రం అయోమయ స్థితిలో పడిపోయాను. 'చదువుకోవాలి, నాకిప్పుడే పెళ్ళి వద్దు' అంటున్న నా మాటల్ని ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. మనస్సంతా చికాకుగా వుంది. గౌతమ్! అసలు మీరెందుకు మా ఇంట్లో అద్దెకి రావాలి? వచ్చిన వాళ్లు నా మనస్సులోకి ఎందుకు రావాలి? మిమ్మల్ని చూసిన మరుక్షణంలోనే మనస్సు పారేసుకున్న నేను నా మనస్సుని మీరుగుర్తించారో లేదో కూడా తెలియక ఎంత హింస అనుభవిస్తున్నానో ఎవరికి తెలుసు!?

*18-3-91*

గౌతమ్ నా మనస్సుని మీకెలా తెలపాలి?



తెలిపినా నా ప్రేమని మీరు అంగీకరిస్తారో లేక తిరస్కరిస్తారో! నా పక్కన మిమ్మల్ని తప్ప ఇంకొకరిని ఊహించుకోవడానికే నా మనస్సు ఒప్పుకోవడం లేదు.

*29-3-91*

గౌతమ్! ఈ రోజు ఎంత సాహసం చేశానో తెలుసా! ఎప్పుడూ నేను నాన్న గారి ఎదుట అసలు మాట్లాడలేదు. కనీసం ఇది కావాలి అని కూడా స్వయంగా అడగలేను. ప్రతిదీ అమ్మ చేత అడిగించేదాన్ని. అలాంటిది నాన్నగారి ఎదుట పడి 'నాకీ పెళ్ళి ఇష్టం లేదు. నేను చేసుకోను' అని గట్టిగా చెప్పాను. ఎందుకిష్టం లేదు అని అడిగితే ఏం చెప్పలేకపోయాను. మీ విషయం చెప్పాలని మనస్సు తొందరపెట్టినా ఆ సాహసం చేయలేకపోయాను.

*3-4-91*

ఎన్ని విధాల పెళ్ళి వద్దు అని వాదించినా ఊఘ్నాలాభం లేకపోయింది. నాన్నగారి ముందు నేను ఓడిపోయాను గౌతమ్. చివరగా నాన్నగారు ఓ మాట అన్నారు. "ఇంక రెండు రోజుల్లో ముహూర్తాలు పెట్టుకోవడానికి వాళ్ళు వస్తారు. అప్పటికి కూడా నువ్వీ పెళ్ళి వద్దు అని మొండి పట్టు పడితే నా శవాన్ని చూడాల్సివుంటుంది" నాకేమి చెయ్యడానికీ తోచడం లేదు.

* * *

కాలేజీ నుండి అప్పుడే వచ్చింది శ్రావణి. ఇంటికి తాళం పెట్టి వుండడం చూసి ఆశ్చర్య పోయింది. అంతా ఒకేసారి ఎక్కడికి వెళ్లి వుంటా రబ్బా అనుకుంటూ మేడ మెట్ల వైపు నడిచింది. గదిలో గౌతమ్ ఎక్కడికో వెళ్ళడానికి తయారవుతున్నట్టుంది.

"అమ్మా వాళ్ళు మీకు కీస్ ఇచ్చారా?" తలొంచుకుని నేల చూపులు చూస్తూ నెమ్మదిగా అడిగింది.

"నేను మీ కోసమే వెయిట్ చేస్తున్నాను శ్రావణీ. మనం హాస్పిటల్‌కి వెళ్ళాలి"

"హాస్పిటల్‌కా! ఎందుకు?" కంగారు పడింది.

"మీ నాన్నగారికి మైల్డ్‌గా హార్ట్ ఎటాక్ వచ్చింది. అంతా హాస్పిటల్‌లో వున్నారు. నేను నీ కోసం వచ్చి వెయిట్ చేస్తున్నాను!"

"నాన్న గారికి హార్ట్ ఎటాకా" శ్రావణి కళ్ళు వర్షించడం మొదలుపెట్టాయి.

అది చూసి గౌతమ్ కొద్దిగా కంగారుపడ్డాడు.

రచయిత్రి చిరునామా:
నారదాసు పద్మ
C/o. సిహెచ్.కోటేశ్వరరావు
గణపతినగర్ 2వ లైన్ హనుమయ్యనగర్
కొరిటిపాడు గుంటూరు.

"టేకిట్ ఈజీ శ్రావణీ! కంగారు పడాల్సిన పని లేదు. మీ నాన్నగారు కులాసాగానే వున్నారు. నువ్విలా వర్రీ అవ్వాల్సిన పనేం లేదు. మంచి నీళ్ళు కావాలా..." అనునయంగా అంటూ ఆమె చేతిలోని పుస్తకాలు తీసుకుని టేబుల్ మీద పడేసి రూమ్ లాక్ వేశాడు.

గౌతమ్ వెనుక స్కూటర్ మీద కూర్చున్న శ్రావణి నిస్సత్తువగా అతని భుజం మీద వాలి పోయింది. ఏ వ్యక్తి కంఠం వింటే మనస్సు పురి విప్పి నాట్యం చేస్తుందో, ఏ వ్యక్తి రూపం కన్పిస్తే ఆ కళ్ళు తళుక్కున మెరుస్తాయో, ఏ వ్యక్తి ఉనికి ఆమె మేనిలో పులకింతలు రేపుతుందో ఆ వ్యక్తి అలా చేరువగా వున్నా పరిస్థితులకు తల్లడిల్లుతూ విచార మేఘాలు హృదయాన్నాక్రమించి వుండడం వల్ల ఏ విధమైన మధుర భావనలూ ఆమెలో కలగడం లేదు. 'తన కారణంగానే తండ్రికి హార్ట్ ఎటాక్ వచ్చింది. తనే తండ్రికి ఆవేశం తెప్పించింది' అనుకుని విపరీతంగా బాధ పడుతూందామె. ఉదయం కాలేజీకి వెళ్తూ "రేపు మంచి రోజు. పురోహితుడ్ని తీసుకుని వాళ్ళు వస్తారు ముహూర్తాలు పెట్టుకోవడానికి" అని తల్లితో తండ్రి చెప్పడం విని ఎందుకో ఆవేశం పట్టలేక దూకుడుగా వెళ్ళి "మీకెంత చెపుతున్నా అర్థం చేసుకోరేంటి? చావనన్నా ఛస్తాను కాని నేను మాత్రం ఈ పెళ్ళి చేసుకోను!" కోపంగా అనేసి బయటకొచ్చింది.

'అదే - ఆ ప్రవర్తనే తన తండ్రి హృదయం మీద దెబ్బ కొట్టిందేమో! ప్రేమ మత్తులో పడి తనెంత పని చేసింది! ఛీ-ఛీ. తన ప్రేమ కున్న ఆయుస్సు ముచ్చటగా మూడు నెలలు మాత్రమే. కాని తన తండ్రితో ఇరవై యేళ్ళ అనుబంధం!' తప్పుచేశాను అన్న భావనతో విపరీతంగా కదిలిపోయి రోదిస్తుందామె.

ఆమె మనస్సులోని సంఘర్షణ తెలియని గౌతమ్ మాత్రం "అరె ఏమిటిది శ్రావణీ చిన్న పిల్లలా! ఊరుకో. మీ నాన్నగారికేం ఫర్వాలేదు. కులాసాగానే వున్నారు. ఎందుకలా బాధపడతావు" అంటూ హాస్పిటల్‌కి చేరే వరకు ఓదారుస్తూనే వున్నాడు.

హాస్పిటల్‌కి చేరుకున్నాక బెడ్ మీద వున్న తండ్రిని చూస్తూనే పరుగున వెళ్ళి అతని కాళ్ళ మీద పడింది. "నన్ను క్షమించండి నాన్నా. పెళ్ళి వద్దు అని మిమ్మల్ని బాధపెట్టాను. మీ ఇష్ట ప్రకారమే పెళ్ళి చేసుకుంటాను" కన్నీళ్లతో వెక్కుతూ చెప్పింది.

## ముక్తాయింపు

తన మనస్సుని ప్రేమించిన వ్యక్తికి తెలపలేక, తండ్రి మాటకి కట్టుబడి శ్రావణి వేరే వ్యక్తితో పెళ్ళికి సిద్ధపడింది. దాంతో చాలా ప్రేమ కథల్లాగే ఈ కథ కూడా విషాదంగా మారబోయింది. కానీ చిన్న మలుపుతో వీరి ప్రేమ కథ సుఖాంతమయింది. ఆ మలుపుకి కారణం డైరీ. తనలో వుప్పొంగుతున్న ప్రేమ సముద్రాన్ని స్వయంగా గౌతమ్‌కి వినిపించినట్లే డైరీలో పొందుపరిచింది శ్రావణి. శ్రావణి తెలుపలేని ప్రేమ సందేశాన్ని ఆ డైరీ గౌతమ్‌కి అందించింది.

హాస్పిటల్‌కి వెళ్తూ తన గదిలో వుంచిన శ్రావణి పుస్తకాల్ని తరువాత యథాలాపంగా చూసిన గౌతమ్‌కి ఆ డైరీ కన్పించింది. చూడ కూడదనుకుంటూనే చూసి, చదివి నిర్ఘాంతపోయాడు. శ్రావణి ఎందుకంత బాధపడిందో అప్పుడర్థమైందతనికి. 'నేడో రేపో ముహూర్తాలు పెట్టుకునే స్థితిలో వాళ్లు వున్నారు. ఏ విధంగానైతేనేం శ్రావణి కూడా పెళ్ళికి సిద్ధపడింది. ఈ పరిస్థితిలో తనేం చెయ్యాలి?' గౌతమ్ నిర్విరామంగా, పిచ్చిగా ఆలోచించాడు. డైరీని కాల్చి పడేసి ఏం జరగనట్టు ఎప్పటిలా మామూలుగా వుండిపోదాం అనుకున్నాడు కాని అందుకు అతని మనస్సే ఎదురు తిరిగింది.

ప్రేమ, ఆప్యాయత అంటే ఏమిటో తెలియకుండా అనాథగా పెరిగిన అతని మనస్సుకి ఆ డైరీ ఓ లేత హృదయం ఆలపించిన అనురాగ రాగాల్ని అపురూపంగా విన్పించడం వల్ల తన కోసం ఆరాటపడే ఆ హృదయాన్ని అతను వదులుకోదలుచుకోలేదు. 'తననే కోరుకుంటున్న ఆ హృదయం తనకి తెలిసీ వదులుకోవాలా- నో, నెవ్వర్' ఒక నిశ్చయానికి వచ్చి గౌతమ్ శ్రావణి నాన్నగారితో మాట్లాడాడు. దీనికి ఆయన ఒప్పుకోలేదు. గౌతమ్ మొదట ప్రాధేయపడి, చివరికి బెదిరించి, ఎదిరించి, ఎన్నో విధాల వాదించి ఆయన చేతే కాళ్ళు కడిగించుకుని కన్యాదానం చేయించుకుని శ్రావణిని గెలుచుకున్నాడు. ●

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్